



సిద్దిపేట పట్టణంలో తెల్లవారుజామున కమ్ముకున్న పొగమంచు

తగ్గేదేలే..!

మూడో రోజూ సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదు

కోహీర్‌లో 8.1 డిగ్రీలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతూనే ఉంది. సాయంత్రం 5 గంటల నుంచే చల్లదనం ప్రారంభమవుతుంది. ఉదయం సాయంత్రం, రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. చలికి సిద్దిపేట సామాన్యులు గజగజ వణుకుతున్నారు. ముఖ్యంగా తెల్లవారుజామున మరియు ఉదయం వేళలో పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు చలికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం బయటకు వచ్చే ప్రతి ఒక్కరూ మంకీ క్యాప్‌లు, స్వెట్టర్లు, మఫ్లర్లు ధరిస్తున్నారు. చలి తీవ్రత పెరిగేకొద్దీ ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో మూడో రోజు కనిష్ఠ ఉష్ణోగ్రత సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. ఆదివారం 8.1 డిగ్రీలు నమోదైంది. ఉమ్మడి జిల్లాలోని సదాశివపేట, ఝరాసంగం, న్యాల్కల్, నల్లవల్లి, కొండపాక, అంగడికిష్టాపూర్, పోతిరెడ్డిపేటలో పది డిగ్రీల లోపు అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో 25 చోట్ల 11 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

- కోహీర్/సిద్దిపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి)





సత్యనారాయణ స్వామి వ్రతంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు

మంత్రి క్యాంపు కార్యాలయంలో ..

వైభవంగా సత్యనారాయణ వ్రతం

- భారీగా తరలివచ్చిన మహిళలు, ప్రజలు

హుస్నాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంజుల దంపతులు శ్రీ సత్యనారాయణ వ్రత మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు నియోజకవర్గంలోని మహిళలు, కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్రతానికి వచ్చిన మహిళలకు పొన్నం ప్రభాకర్ దంపతులు పసుపు, బొట్టు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మంచి వర్షాలు, పాడి పంటలతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రజా పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి అవరోధాలు లేకుండా అన్నింట్లో విజయాలు చేకూరాలని సత్యనారాయణ వ్రతం నిర్వహించినట్లు చెప్పారు.



వ్రతానికి హాజరైన మహిళలు

విద్యుత్ ప్రజాబాట

- ప్రజలు, రైతుల వద్దకు వెళ్తున్న అధికారులు, సిబ్బంది
- సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పిచ్చిమొక్కల తొలగింపు
- నాలుగు గంటలచొప్పున వారంలో మూడు రోజులు పర్యటన
- సమస్య తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారం
- లో వోల్టేజీ లేని నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం
- జిల్లాలో 3 డివిజన్లు, 50వేలకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు



సిద్దిపేటలోని ఓ వార్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్త, గడ్డిని తొలగిస్తున్న సిబ్బంది

సిద్దిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయాలతో పాటు, వినియోగదారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై విద్యుత్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఆ శాఖ అధికారులు, సిబ్బంది ప్రజల వద్దకు నేరుగా వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ప్రజా బాట కార్యక్రమాన్ని ప్రారంభించింది.

జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న అంతరాయాలపై వస్తున్న ఫిర్యాదులను దాదాపుగా అక్కడికక్కడే పరిష్కరించేలా అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారు. వ్యవసాయ రంగంతో పాటు, గృహాలు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలకు సరఫరా అవుతున్న విద్యుత్ సమస్యలపై ఆరా తీస్తున్నారు. జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆదేశాల మేరకు సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్ మూడు డివిజన్లలో వారంలో మూడు రోజుల పాటు, ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దాదాపు నాలుగు గంటల పాటు క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం

జిల్లాలో సరఫరా చేస్తున్న విద్యుత్‌లో భాగంగా.. వ్యవసాయ రంగానికి, నివాస గృహాలకు సంబంధించిన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లు, లూజ్‌గా ఉన్న వైర్లు, వంగి ఉన్న విద్యుత్ స్తంభాలు, ఫ్యూజులు, ఎర్తింగ్, లో-వోల్టేజీ, అధిక విద్యుత్ బిల్లులు వంటి సమస్యలను గ్రామాల్లో, వార్డుల్లో అధికారులు, సిబ్బంది కలిసి ఆరా తీస్తున్నారు. ప్రతి ఇంటింటికి వెళ్లి ఏమైనా సమస్యలుంటే అక్కడిక్కడే పరిష్కరిస్తున్నారు. జిల్లాలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో, ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద పేరుకుపోయిన చెత్త, గడ్డి, పిచ్చి మొక్కలను సైతం తొలగిస్తున్నారు. విద్యుత్ వైర్లకు ఆటంకం కలిగిస్తున్న చెట్ల కొమ్మలను మున్సిపల్ అధికారుల సమన్వయంతో తొలగిస్తున్నారు.

వారంలో మూడు రోజులు... నాలుగు గంటల పాటు

రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్‌తో పాటు డీఈ, ఏడీఈ, ఏఈలు, లైన్‌మెన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పలు బృందాలుగా ఏర్పడ్డారు. వీరు వారంలో మూడు రోజుల పాటు (మంగళవారం, గురువారం, శనివారం) ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు దాదాపు నాలుగు గంటల పాటు క్షేత్రస్థాయిలో కలియతిరుగుతూ పర్యటిస్తున్నారు. గతంలో విద్యుత్ సమస్య ఉందని చెబితే కనీసం పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వినిపించగా,

మిగతా 8లో...



మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

'జీఎంసీ'కి మదన్‌మోహన్

పేరు పెట్టేలా కృషి చేస్తా

- రాజకీయాల కంటే వ్యక్తులు చేసిన కృషి గొప్పది
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం కేసీఆర్ మంజూరు చేసిన సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు దివంగత కాంగ్రెస్ నేత అనంతుల మదన్‌మోహన్ పేరు పెట్టేలా కృషి చేస్తానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఆదివారం సిద్దిపేటలోని విక్టరీ చౌరస్తా వద్ద గల పార్కు ప్రాంగణంలో సిద్దిపేట మాజీ ఎమ్మెల్యే, మాజీమంత్రి, దివంగత కాంగ్రెస్ నేత మదన్‌మోహన్ విగ్రహాన్ని వారి కుటుంబ సభ్యులతో కలిసి హరీశ్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయాల కంటే వ్యక్తులు చేసిన కృషి గొప్పదని తెలిపారు. సిద్దిపేటతో కేసీఆర్‌కు, మదన్‌మోహన్‌కు విడదీయరాని సంబంధం ఉందని, పార్టీలు, రాజకీయాలు శాశ్వతం కాదని, వ్యక్తులు చేసిన సేవలే శాశ్వతమని చాటి చెప్పడమే సిద్దిపేట విజన్ అని అన్నారు. ఆ రోజుల్లో సిద్దిపేటలో 100 పడకల ఆసుపత్రిని తెచ్చిన గొప్ప నాయకుడు మదన్‌మోహన్ అని కొనియాడారు. మదన్‌మోహన్ సిద్దిపేటకు చేసిన సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని, రాజకీయ నేతగా కాకుండా ఒక వ్యక్తిగా ఆయన తనదైన శైలిలో సిద్దిపేటకు సేవ చేశారని అన్నారు. నేడు సిద్దిపేట అభివృద్ధి గురించి దేశ, విదేశాల్లో ప్రశంసలు దక్కుతుంటే మదన్‌మోహన్ ఆత్మ సంతోషిస్తూ ఉండొచ్చునన్నారు. సిద్దిపేట మెడికల్ కాలేజీకి మదన్‌మోహన్ పేరు పెట్టేలా సీఎం రేవంత్‌రెడ్డికి ఉత్తరం రాస్తానని ప్రకటించారు.



జిల్లా మహాసభల సందర్భంగా మాట్లాడుతున్న చుక్కా రాములు

కార్మికవర్గ వ్యతిరేక విధానాలపై

అలుపెరగని పోరాటం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

సిద్దిపేట అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మికవర్గ వ్యతిరేక విధానాలపై రాబోయే రోజుల్లో రాజీలేని పోరాటాలను నిర్వహిస్తామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు స్పష్టం చేశారు. సిద్దిపేటలో జరిగిన జిల్లా నాలుగో మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఎగురవేసి ప్రతినిధులనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు అమలులో ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దుపరిచి, వాటి స్థానంలో తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల కారణంగా కార్మికులను కట్టు బానిసలుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోకపోతే భవిష్యత్తులో సమరశీల పోరాటాలకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. అంతకుముందు మహాసభకు సంబంధించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మహాసభ ఆహ్వాన సంఘం చైర్మన్ సింగిరెడ్డి చంద్రారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆముదాల మల్లారెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాల్ స్వామి, జిల్లా కోశాధికారి జి. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కుతం(మం)త్రాలు



- బాబాలమంటూ జనాలను మోసం చేస్తున్న కేటుగాళ్లు
- మూఢ నమ్మకాలు వీడకుంటే అంతే!
- తాజాగా సిద్దిపేటలో జరిగిన సంఘటనపై కేసు నమోదు ..నిందితుడి అరెస్టు

సిద్దిపేట క్రైం నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న ఈ రోజుల్లోనూ మంత్రాల పేరుతో కేటుగాళ్లు బాబా అవతారమెత్తి ప్రజలను నమ్మిస్తున్నారు. సమస్యలు, అనారోగ్యం, అత్యాశను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న ఈ నేరగాళ్లపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. సిద్దిపేటలో ఇలాంటి సంఘటనే చోటుచేసుకోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. మంత్రాల పేరిట ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న సదరు బాబాను ఎట్టకేలకు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

రెండు రోజుల క్రితం సిద్దిపేటకు చెందిన ఓ వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతని అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న మరో వ్యక్తి, తన వద్ద అతీత మంత్ర శక్తులు ఉన్నాయని, ఎటువంటి బాధలనైనా తీరుస్తానని నమ్మబలికి మోసం చేశాడు. బాధితుని నుంచి డబ్బు తీసుకొని తన ఇంటికి తీసుకెళ్లి ఏవో మంత్రాలు చదివినట్లు నటించి ఇక నయం అవుతుందొ అని చెప్పి పంపించాడు. అయితే, బాధితుడికి ఎలాంటి నయం కాకపోగా, తిరిగి వెళ్లి డబ్బు అడిగినందుకు.. "నిజంగానే మంత్రాలు చేసి చంపుతానని" బెదిరించాడు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని ఇంట్లో బూడిద, కాగితపు చిట్టీలు, రంగురంగుల దారాలు, తావీజులు, పేపర్లు కట్టి ఉన్న జెండాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కొన్ని ఇతర సంఘటనలు

2017లో దుబ్బాకలో ఆరోగ్యం క్షీణిస్తుండడంతో చేతబడి చేశారని అనుమానంతో భార్యాభర్తలను ఇద్దరిపై దాడి చేసి హత్య చేశారు. ఈ కేసులో పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లాలో మరో చోట, ఒకరి ఇంట్లో గుప్త నిధులున్నాయని నమ్మించి బయటకు తీస్తామని డబ్బులు తీసుకొని మోసం చేశారు. ఇలాంటి సంఘటనలు చాలా ఉన్నప్పటికీ, పరువు పోతుందని భావించి చాలామంది బయటకు చెప్పుకోవడం లేదు.

అవగాహన కల్పించడంలో విఫలం

జిల్లాలో పోలీస్ కళాబృందం ఉన్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీస్ కళాబృందం గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణాల్లో మూఢనమ్మకాలను నమ్మవద్దని, క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించలేకపోతున్నారు. ఏదో నామమాత్రంగా కార్యక్రమాలు చేపడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు ప్రజలకు అవగాహన కల్పించకపోవడం వల్లనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని కొందరు విమర్శిస్తున్నారు.

'నాగటి తరం'

నవల ఆవిష్కరణ

7

20న జిల్లా స్థాయి

కబడ్డీ ఎంపికలు

7

భవనాలున్నా.. వినియోగం సున్నా..

- ఆదర్శ గ్రామం మల్యాపూర్‌లో రూ.కోట్లతో నిర్మించిన భవనాల నిర్వహణ కరువు
- మందుబాబులకు అడ్డాగా ఫంక్షన్‌హాల్
- అల్లాదుర్గం మండలంలోని కొత్త జీపీలకు లేని సొంత భవనాలు
- అంగన్‌వాడీ, పాఠశాల గదుల్లోనే కార్యకలాపాలు
- నిజాంపేటలో అద్దె భవనాల్లో ఆఫీసులు

7

చేర్యాల ఠాణా పరిధిలోకి

ఆ రెండు గ్రామాలు

- హర్షం వ్యక్తం చేసిన అర్జునపట్ల, కమలాయపల్లి ప్రజలు

చేర్యాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలంగా అర్జునపట్ల, కమలాయపల్లి గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్న పోలీస్ ఠాణా సేవలు ఇకనుండి చేరువ కానున్నాయి. భౌగోళికంగా చేర్యాలకు దగ్గరగా ఉన్నప్పటికీ, ఈ రెండు గ్రామాలు సుదూరంలోని మద్దూరు మండల పరిధిలో కొనసాగుతున్నాయి. చేర్యాల మండలంలో విలీనం చేయాలని స్థానికులు కొన్నేళ్ల పాటు అధికారులు, ప్రజాప్రతినిధులను విన్నవించారు. మూడేళ్ల క్రితం రెవెన్యూ విభాగాన్ని, కొన్ని నెలల క్రితం పంచాయతీరాజ్ విభాగాన్ని చేర్యాలలో విలీనం చేశారు. పోలీస్ సేవలు మాత్రం మద్దూరు పరిధిలోనే ఉండేవి. మిగిలిన పోలీస్ విభాగాన్ని కూడా చేర్యాల పరిధిలోకి మార్చాలనే స్థానికుల డిమాండ్‌ను ఉన్నతాధికారులు పరిశీలించారు. ఈ మేరకు ఆదివారం చేర్యాల సీఐ శ్రీను ఆయా గ్రామాలను సందర్శించి గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఇక నుంచి చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో సేవలు అందిస్తామని వెల్లడించారు. పరిపాలన, భౌగోళిక పరమైన సౌలభ్యం దృష్ట్యా సీపీ విజయ్‌కుమార్ ప్రత్యేక చొరవ వహించి ఈ మార్పును సాకారం చేశారని తెలిపారు. దీంతో రెండు గ్రామాల ప్రజలు పోలీసు ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

యథేచ్ఛగా మాంసం వ్యర్థాల పారబోత

- కలుషితమవుతున్న పెద్దచెరువు జలాలు



చేర్యాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చేర్యాలలోని పెద్ద చెరువు జలాలు తీవ్రంగా కలుషితమవుతున్నాయి. కొద్దిరోజులుగా కొందరు మాంసం వ్యర్థాలను యథేచ్ఛగా చెరువు కట్ట ఆవరణలో, చెరువు నీటిలో పారబోస్తున్నారు. దీంతో మాంసం వ్యర్థాలు నీటిపై తేలియాడుతుండటంతో పాటు కట్ట పరిసరాలు కంపు వాసనతో దుర్వాసన వెదజల్లుతుంది. చెరువు కట్టపై ఉదయం వేళ వాకర్స్, అటుగా వెళ్లే రైతులు వాసన భరించలేకపోతున్నారు. చెత్త సేకరణలో మునిసిపల్ అధికారుల పర్యవేక్షణా లోపం, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఈ సమస్య తలెత్తుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి, పెద్ద చెరువు జలాలు కలుషితం కాకుండా, వ్యర్థాలు పారబోయకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



కుటుంబ పెద్దలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నర్సాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న బాలికకు వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం బాలిక వివాహం జరుగుతుందన్న సమాచారం అందడంతో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి హేమభార్గవి ఆదేశాల మేరకు అంగన్‌వాడీ టీచర్ అన్నపూర్ణ, స్వప్న, చైల్డ్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ గంగాధర్, స్థానిక ఎస్‌ఐ రంజితకుమార్ సహకారంతో కూడిన అధికారుల బృందం ఆదివారం ఫంక్షన్ హాల్‌కు వెళ్లింది. వివాహం నిర్వహిస్తున్న ఇరు కుటుంబాల పెద్దలతో మాట్లాడి, బాల్య వివాహం వల్ల కలిగే అనర్థాలతో పాటు చట్టపరంగా ఎదురయ్యే సమస్యలను వివరించి, వివాహం జరగకుండా నివారించారు. బాల్య వివాహం చేస్తున్నందున సంబంధిత విషయాన్ని పూర్తి స్థాయి విచారణ చేసి బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడానికి సంగారెడ్డి జిల్లా అధికారులకు అప్పగించారు.

దూడపై గుర్తు తెలియని జంతువు దాడి

రాయపోల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని జంతువు దాడిలో ఓ దూడ మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అనాజీపూర్‌కు చెందిన కొత్త రవీందర్ రెడ్డి ప్రతిరోజు పశువులను పొలం వద్ద దొడ్డిలో కట్టేస్తుంటారు. శనివారం రాత్రి కూడా పశువులను కట్టేసి ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం వెళ్లి చూసేసరికి దూడ తీవ్ర గాయంతో మృతి చెంది ఉంది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడికి వచ్చి, దూడను చూసి చిరుతపులి దాడి చేసి చంపిందని ఆందోళనకు గురయ్యారు. ఈ విషయమై ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా, బీట్ ఆఫీసర్ వేణు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఇది చిరుత పులి దాడిలా కనిపించడం లేదని ఆయన తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, పశువులను పొలాల వద్ద కట్టేయవద్దని సూచించారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు.

వడియారం చెరువులో మొసళ్లు ప్రత్యక్షం



వడియారం గ్రామం ఊర చెరువులో మొసళ్లు

చేగుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండలంలోని వడియారం చెరువు పరిసరాలకు వెళ్లాలంటేనే జనం జంకాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా చెరువులోకి వరదనీరు చేరడంతో ఆదివారం రెండు మొసళ్లు చెరువులో కనిపించాయి. దీంతో గ్రామస్థులు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రతిరోజూ చెరువు మీదుగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం పొలాలకు వెళ్లేటప్పుడు ఆ రెండు మొసళ్లు నీటిపై తలలు ఎత్తి కనిపిస్తున్నాయని గ్రామస్థులు తెలిపారు. వెంటనే అటవీ శాఖ అధికారులు స్పందించి, మొసళ్లను త్వరగా పట్టుకుని చెరువును సురక్షితం చేయాలని, లేకుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.



రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న మానవ హక్కుల సంఘం వేదిక సభ్యులు

మేల్, ఫీమేల్ వరి వంగడాల పేరిట మోసం

- పీడీ యాక్ట్ పెట్టాలని డిమాండ్

చేగుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు సరఫరా చేస్తూ రైతులను మోసం చేస్తున్న కంపెనీలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని మానవ హక్కుల సంఘం వేదిక రాష్ట్ర కార్యదర్శి షేక్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఆదివారం చేగుంట మండలం రుక్మాపూర్‌లో నకిలీ విత్తనాలతో పంట నష్టపోయిన రైతుల పొలాలను మానవ హక్కుల వేదిక నేతలు షేక్ అహ్మద్, దిలీప్, రోహిత్, సిరి బృందం పరిశీలించింది. రైతు సమస్యలను నమోదు చేసుకుని, వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా షేక్ అహ్మద్ మాట్లాడుతూ మేల్ , ఫీమేల్ వంగడాల పేరుతో ఉచితంగా విత్తనాలు సరఫరా చేసి కొన్ని కంపెనీలు రైతులను మోసం చేస్తున్నాయన్నారు. రుక్మాపూర్ ఒక్క గ్రామంలోనే 100 ఎకరాల పంటకు నష్టం వాటిల్లిందన్నారు. నకిలీ విత్తనాలు సరఫరా చేసిన కంపెనీలపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.80 వేల నష్టపరిహారం కంపెనీల నుంచి ఇప్పించాలని డిమాండ్ చేశారు. రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవని, ఇప్పటికైనా కేసులు నమోదు చేయాలన్నారు సొసైటీ చైర్మన్ పరమేష్, పంట నష్టపోయిన రైతులు శ్రీనివాస్, మోహన్, లక్ష్మి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



స్పందన

పటాన్‌చెరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెల్లాపూర్ పురపాలక పరిధిలోని ముత్తంగి గ్రామం డీఎస్ కాలనీలో నివాసం ఉంటున్న 19 ఏళ్ల ఆలేటి స్పందన ఆదివారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో, ఉదయం నుంచి చుట్టుపక్కల ప్రాంతాల్లో విచారించారు. ఫలితం లేకపోవడంతో ఆమె తండ్రి ప్రభుదాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అత్తింటి వేధింపులు తాళలేక

వివాహిత ఆత్మహత్య

- సంగారెడ్డి జిల్లా పెద్దారెడ్డిపేటలో విషాదం
- భర్త, అత్త, మామలపై కేసు నమోదు



లక్ష్మి (ఫైల్)

పుల్కల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అత్తింటి వేధింపులను తాళలేక ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సంగారెడ్డి జిల్లా పుల్కల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకున్నది. ఆదివారం ఏఎస్‌ఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం బిజిలీపూర్‌కు చెందిన కొప్పు లక్ష్మి(26)కి రెండున్నరేళ్ల క్రితం పుల్కల్ మండలంలోని పెద్దారెడ్డిపేట గ్రామానికి చెందిన పట్నం ప్రవీణ్‌కుమార్(30)తో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ. 9 లక్షల నగదుతో పాటు బంగారం, ఇతర లాంఛనాలను ప్రవీణ్‌కుమార్‌కు ఇచ్చారు. వివాహమైన నాలుగు నెలల పాటు వారి కాపురం సాఫీగా కొనసాగింది. అనంతరం పుట్టింటి నుంచి అదనంగా కట్నం తీసుకురావాలంటూ భర్త ప్రవీణ్‌కుమార్, అత్త, మామలు లక్ష్మిని వేధించడం ప్రారంభించారు. తరచూ వేధింపులకు గురి చేస్తుండటంతో, లక్ష్మి తల్లిదండ్రులు ఆమెను పుట్టింటికి తీసుకువెళ్లారు. మూడు నెలల పాటు పుట్టింట్లో ఉన్న లక్ష్మిని తీసుకువెళ్లేందుకు భర్త ప్రవీణ్‌కుమార్ గ్రామ పెద్దలను వెంట తీసుకువెళ్లి, బాగా చూసుకుంటానని చెప్పి కాపురానికి తీసుకువచ్చాడు. నెల రోజుల పాటు బాగానే ఉన్నా, తాజాగా శనివారం భర్త ప్రవీణ్‌కుమార్, అత్త యాదమ్మ, మామ యాదయ్యలు కలిసి ఆమెను చిత్రహింసలకు గురి చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన లక్ష్మి శనివారం ఇంట్లో గదిలో దూలానికి ఉరేసుకుంది. ఇది గమనించిన భర్త ప్రవీణ్‌కుమార్ స్థానికుల సహాయంతో జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన డాక్టర్లు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలికి 10 నెలల పాప ఉన్నది. తమ కూతురు లక్ష్మి మృతికి కారణమైన భర్త ప్రవీణ్‌కుమార్, అత్త మామలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహానికి ఆదివారం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని జోగిపేట సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

సిద్దిపేట రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సిద్దిపేట రూరల్ ఎస్‌ఐ కె.రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం సాయంత్రం బురుగుపల్లి చౌరస్తాలో చలికి ఇబ్బంది పడుతుండగా చూసిన సిరిబోజు నరేంద్ర చారి అనే వ్యక్తి మానవత్వంతో అతన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని వద్ద లభించిన ఫోన్ నంబర్‌ల ఆధారంగా నగేష్, విఠల్ అనే మేస్త్రీలను విచారించగా, మృతుడు వరంగల్ జిల్లా మడికొండవాసిగా తెలిసింది. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే సిద్దిపేట రూరల్ ఎస్‌ఐ 8712667321, రూరల్ సీఐ 8712667320 నంబర్ల ద్వారా సంప్రదించాలని కోరారు.

వంతెన కిందకు దూసుకెళ్లిన కోళ్ల వ్యాన్

- త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన కోళ్ల వ్యాను

నిజాంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వరదలకు దెబ్బతిని కుంగిపోయిన కల్వర్టు వద్ద ఓ కోళ్ల వ్యాన్ అదుపుతప్పి కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో పెనుప్రమాదం తృటిలో తప్పింది. వివరాల్లోకి వెళితే, ఆదివారం మండల పరిధిలోని నందిగామ గ్రామ శివారులో సిద్దిపేట నుంచి రామాయంపేట వైపు వేగంగా వెళుతున్న కోళ్ల వ్యాను ఒక్కసారిగా అదుపుతప్పి వంతెన కిందికి దూసుకెళ్లింది. ఈ తాత్కాలిక వంతెనపై నిత్యం వాహన రాకపోకలు కొనసాగుతున్నాయి. వంతెన నిర్మాణం సరిగా లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి, పూర్తిస్థాయి రోడ్డు పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఆటోను తప్పించబోయి...



అదుపుతప్పి పార్కు చేసిన బైక్‌లపై పడ్డ వ్యాన్

నర్సాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వైపు నుంచి మెదక్ వైపు వెళ్తున్న కోళ్లకు చెందిన ఖాళీ వ్యాను, నర్సాపూర్ బస్టాండు సమీపంలో యూటర్న్ చేస్తున్న ఆటో ఒక్కసారిగా రావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వ్యాన్ అదుపుతప్పి మసీదులో ప్రార్థనలకు వచ్చిన వారు పార్కు చేసిన వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఐదు బైకులు పూర్తిగా దెబ్బతినగా, ఆటోకు కూడా వ్యాను తగిలింది. ఆటో డ్రైవర్‌తో పాటు వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. వారిని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, రోడ్డుపై పడిన వ్యానును తొలగించి, కేసు నమోదు చేశారు. మరో ఐదు నిమిషాలు ఆలస్యమైతే, మసీదులో ప్రార్థనలకు వెళ్లిన వారు బయటకు వచ్చి పార్కు చేసిన వాహనాల వద్దే ఉండే వారని, ఆ సమయంలో ప్రమాదం జరిగి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి డివైడర్‌పై ఉన్న చెట్లు ఏపుగా పెరగడం వల్ల యూటర్న్ ఉన్న చోట వాహనాలు కనిపించకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నయీం, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ హబీబ్ ఖాన్ పేర్కొన్నారు. ఆ చెట్లను తొలగించి, పూల మొక్కలు పెట్టాలని వారు డిమాండ్ చేశారు.


తూప్రాన్ : పిచ్చి మొక్కలతో నిండిపోయిన గ్రామ సామాజిక భవనం


రేషన్ దుకాణం, కూలీలకు వసతిగా యూత్ గ్రంథాలయ భవనం


నిజాంపేట : పురాతన భవనంలో నిర్వహిస్తున్న పోలీస్‌స్టేషన్

భవనాలున్నా.. వినియోగం సున్నా..

మెదక్ జిల్లాలోని కొన్ని మండలాల్లో ప్రజల కోసం, ప్రభుత్వ కార్యాలయాల కోసం నిర్మించిన భవనాలు వినియోగంలోకి రాక, కొత్తగా మంజూరైన భవనాల పనులు ప్రారంభం కాక అభివృద్ధికి ఆటంకం కలుగుతోంది. కొత్త మండలాలు, గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసినా, ప్రజల అవసరాల కోసం కోట్లు ఖర్చు చేసి ఆదర్శ గ్రామాల్లో భవనాలు నిర్మించినా, వాటి నిర్వహణ, వినియోగం లోపించడంతో ప్రభుత్వ వసతులు వృథాగా మారుతున్నాయి.

- ఆదర్శ గ్రామం మల్కాపూర్‌లో కోట్లతో నిర్మించిన భవనాల నిర్వహణ కరువు
- మందుబాబులకు అడ్డాగా ఫంక్షన్‌హాల్
- అల్లాదుర్గం మండలంలోని కొత్త జీపీలకు లేని సొంత భవనాలు
- అంగన్‌వాడీ, పాఠశాల గదుల్లోనే కార్యకలాపాలు
- నిజాంపేటలో అద్దె భవనాల్లో ఆఫీసులు
- తొమ్మిదేళ్లయినా రూపు మారని వైనం

పేరుకే ఆదర్శ గ్రామం..

తూప్రాన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలంలోని మల్కాపూర్ ఒకప్పుడు స్వచ్ఛభారత్ నిర్వహణలో మొదటి స్థానంలో నిలిచి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు సాధించి ఆదర్శ గ్రామంగా పేరు పొందింది. ఈ ఆదర్శానికి చిహ్నంగా రూ.80 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం, రూ. కోటితో ఫంక్షన్‌హాల్, రూ.75 లక్షలతో సామాజిక భవనం, రూ.32 లక్షలతో మహిళా భవనం, రూ.29 లక్షలతో యూత్ అండ్ గ్రంథాలయ భవనాలు సహా అనేక నిర్మాణాలు చేపట్టారు. కానీ వినియోగంలోకి తీసుకురాకపోవడంతో వృథాగా ఉండిపోయాయి. కోటి రూపాయలతో నిర్మించిన ఫంక్షన్‌హాల్ నిర్వహణ లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. మద్యం బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. సామాజిక భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయి, కనీసం సమావేశాలు నిర్వహించలేని పరిస్థితి నెలకొన్నది. ఇక యూత్ భవనం కూలీలకు వసతిగా మారగా, గ్రంథాలయ భవనం రేషన్ దుకాణానికి ఉపయోగపడుతోంది. పుస్తకాలు, క్రీడా, జిమ్ సామాగ్రి ఏమీ ఏర్పాటు చేయలేదు. స్వచ్ఛభారత్ కార్యక్రమం నిలిపివేయడంతో గ్రామంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. మహనీయుల పేర్లతో ఉన్న వీధులు కంపుకొడుతున్నాయి.


అల్లాదుర్గం : ఐబీ గిరిజన తండాలోని ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న గ్రామపంచాయతీ కార్యాలయం

కొత్త పంచాయతీలకు పక్కా భవనాలేవి?

అల్లాదుర్గం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఐదు వందల జనాభా కలిగిన గ్రామాలను, గిరిజన తండాలను కొత్త గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసినా, ఈ నూతన కార్యాలయాలకు పక్కా భవనాలు లేవు. అల్లాదుర్గం మండలంలోని సీతానగర్, ఐబీ గిరిజన తండా, గొల్లకుంట గిరిజన తండాల పరిస్థితి ఇదే. ఈ గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అరకొర వసతుల మధ్య విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొన్నది. ఉదాహరణకు, గొల్లకుంట తండా గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రంలో కొనసాగుతోంది, అక్కడ ఒకే ఒక్క గదిలో అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ పంచాయతీ కార్యాలయం రెండు నడుస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక సీతానగర్, ఐబీ గిరిజన తండా గ్రామ పంచాయతీ భవన నిర్మాణాల కోసం ఉపాధి హామీ నిధుల ద్వారా ఒక్కో భవనానికి రూ.20 లక్షలు మంజూరైనప్పటికీ, అధికారులు ఇంతవరకు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టలేదు. దశాబ్ద కాలం కావస్తున్నా ఈ సమస్య పరిష్కారం కావడం లేదు.


అల్లాదుర్గం : సీతానగర్ ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న గ్రామపంచాయతీ కార్యాలయం

తొమ్మిదేళ్లయినా మారని నిజాంపేట రూపు..

నిజాంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట నుంచి విడిపోయి మండలంగా ఏర్పడి తొమ్మిదేళ్లు కావస్తున్నా నిజాంపేట మండల కేంద్రం రూపురేఖలు మారడంలేదు. మండల కేంద్రంగా గుర్తించినా, ఏ ఒక్క ప్రభుత్వ కార్యాలయానికి కూడా ప్రభుత్వం కొత్త భవనాలను నిర్మించలేదు. 2016 లో ఇక్కడ పోలీస్‌స్టేషన్, తహసీల్దార్, ఎంఈవో, వ్యవసాయ, ఎంపీడీవో కార్యాలయాలు ప్రారంభించారు. కానీ ఇవన్నీ పెంకుటిళ్లలో, ఎప్పుడు కూలుతుందో తెలియని శిథిలావస్థలకు చేరిన పురాతన అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. పురాతన ప్రభుత్వ పాఠశాలలో పోలీస్ స్టేషన్, పెంకులు పగిలిన శిథిల భవనంలో తహసీల్దార్ కార్యాలయం నడుస్తుండడం గమనార్హం. పీహెచ్‌సీ స్థల పరిశీలన జరిగి ఏడాది కావస్తున్నా అతీగతీ లేదు. కస్తూర్బా గురుకులం మంజూరైనా భవనం లేక పిల్లలను రామాయంపేట గురుకులంలో చేర్చారు. పేరుకు మండల కేంద్రం అయినప్పటికీ, గ్రామ పంచాయతీకి ఉన్న వసతులు కూడా ఇక్కడ లేకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


పెంకుటింట్లో ఎంపీడీవో కార్యాలయం

వినియోగంలోకి తేవాలి..

ప్రజల పన్నుల డబ్బుతో నిర్మించిన విలువైన భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని, కొత్త భవనాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ సమస్యలపై దృష్టి సారించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సిధారెడ్డి రచించిన 'నాగటి తరం' నవల ఆవిష్కరణ


సిధారెడ్డి రాసిన నాగటితరం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

కొండపాక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాన్ని అర్థం చేసుకుంటే మొత్తం దేశాన్నే అర్థం చేసుకున్నట్లే. 'నాగటి తరం'లో గ్రామీణ జీవితంలోని చిన్న చిన్న ఘటలు కూడా చరిత్రాత్మకమైన లోతుతో నిండి ఉన్నాయి అని ప్రముఖ కవి రచయిత నాళేశ్వరం శంకరం అన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం బందారం గ్రామంలో మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో రచయిత నందిని సిధారెడ్డి రాసిన 'నాగటి తరం' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు రచయితలు, కళాకారులు మాట్లాడారు. ముందుగా నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ... తెలంగాణ భాష, సంగీతం, పల్లె జీవన విధానంలోని సాదాసీదా స్వచ్ఛతతో పాటు, కుల, వర్గ, సామాజిక ఒత్తిళ్ల తాలూకు చేదు అయిన నిజమైన వాస్తవికతను రచయిత్రి హృదయపూర్వకంగా చిత్రీకరించారన్నారు. ఈ నవలలోని వ్యక్తులు కేవలం పాత్రలు కావని, వారు మన గ్రామాల్లో నడిచే మనుషులని పేర్కొన్నారు. వారి పేదరికం, ధైర్యం, నిర్వేదం, ప్రేమ అన్నీ కలగలిసి ఒక తరాన్ని అక్షరాల్లో బంధించాయన్నారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ 'నాగటి తరం' కేవలం కథ కాదని, ఇది రక్తంతో రాసిన చరిత్ర అన్నారు. ధైర్యవంతుల వ్యక్తిత్వం, వారి పోరాటాలు, వారి త్యాగాలు పుటల్లో సజీవంగా కనిపిస్తాయన్నారు. టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు దేవి ప్రసాద్ మాట్లాడుతూ సాహిత్యం కేవలం చదవడానికి కాదని, అది మార్పు కోసం అని, అది ఒక తరానికి దిక్సూచి లాంటిదని చెప్పారు. రచయిత నందిని సిధారెడ్డి మాట్లాడుతూ 'నా తండ్రి జీవితం, మా కుటుంబపు పోరాటం, గ్రామ స్థాయిలో జరిగిన అనేక సంఘటనలు ఇవన్నీ నాకు రాయమంటూ పిలిచాయి. ఈ నవల మా ఇంటి కథ మాత్రమే కాదని, మా గ్రామం కథ, మా తరాల కథ' అని పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడు నక్క యాదవ రెడ్డి, దేవదాసు నర్ర భగవాన్ రెడ్డి, బాల్ నరసయ్య, జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రచయిత కందుకూరి శ్రీరాములు, టేకులపల్లి గోపాల్ రెడ్డి, కొమురవెల్లి అంజయ్య తదితరులు మాట్లాడారు. సీనియర్ జర్నలిస్ట్ బైన దేవదాసు సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ కూతురు రాజిరెడ్డి, పలువురు కళాకారులు, కవులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు


భక్తులతో కిటకిటలాడుతున్న ఏడుపాయల

పాపన్నపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లా వాసులతో పాటు పరిసర జిల్లాలైన నిజామాబాద్, కరీంనగర్, జంట నగరాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు అమ్మ నామ స్మరణతో మార్మోగాయి. తెల్లవారుజామున 5.30 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి, సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు మాతను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఏడుపాయల ఔట్ పోస్టు సిబ్బంది బందోబస్తు చేపట్టారు.


నాచగిరిలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

ఆదిత్య మండల ఆకృతిలో దీపారాధన

వర్గల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ఆదివారం ఆదిత్య మండల ఆకృతిలో దీపాలంకరణ చేశారు. కార్తీక మాసం సందర్భంగా నాచగిరి క్షేత్రానికి భక్తులు అధికంగా తరలివచ్చారు. సుమారు 300 వరకు ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద పూర్తి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్త తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి విజయ రామారావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది నిర్వహించారు.


భక్తులకు దర్శనమిస్తున్న కొండపోచమ్మ

కొండపోచమ్మ ఆలయంలో..

జగదేవ్‌పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిగుల్‌నర్సాపూర్ సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండపోచమ్మకు భక్తుల తాకిడి పెరిగింది. అమ్మవారిని దర్శించుకుని, ఒడి బియ్యం పోసి, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మల్లన్న సేవలో కలెక్టర్ హైమావతి


కలెక్టర్ హైమావతికి స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న కొమురవెల్లి మలన్న ఆలయ ఆలయాధికారులు, అర్చకులు

కొమురవెల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని కార్తీకమాసం ఆదివారం సందర్భంగా కలెక్టర్ హైమావతి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. గర్భాలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్‌కు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. స్వామివారి తీర్థప్రసాదాలను, శేష వస్త్రాలను అందించగా, ఆలయ కార్యనిర్వహణ అధికారి టంకశాల వెంకటేష్ స్వామి వారి చిత్ర పటాన్ని అందించారు. వచ్చే నెల 14 వ తేదీన జరగనున్న మల్లికార్జున స్వామి కల్యాణ ఏర్పాట్లపై కలెక్టర్ ఆలయాధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, సహాయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాస్, నాయబ్ తహసీల్దార్ వేణుగోపాల్, ఏఎంపీవో శ్రీనివాస వర్మ పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన వీరభద్ర స్వామి ఆలయం


వీరభద్రస్వామి ఆలయం ప్రాంగణంలో భక్తుల సందడి

గుమ్మడిదల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్ర స్వామి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. దర్శనానికి ఐదు నుంచి ఆరు గంటల సమయం పట్టింది. పాలకమండలి, ఆలయ సిబ్బంది పర్యవేక్షకుడు సోమయ్య ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. భువనగిరి జాయింట్ కలెక్టర్ వీరారెడ్డి, నర్సాపూర్ మెజిస్ట్రేట్ హేమలత ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ ఈవో శశిధరగుప్తా, ఆలయ చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి, ధర్మకర్తలు భాస్కర్ గౌడ్, పొన్నబోయిన రాజు అధికారులు, విశిష్ట అతిథులను స్వాగతించారు.

20న జిల్లా స్థాయి కబడ్డీ ఎంపికలు


మాట్లాడుతున్న జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు.

సిద్దిపేట కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానంలో ఈ నెల 20న జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు, పురుషులకు సీనియర్, జూనియర్ విభాగాల్లో ఎంపిక పోటీలుంటాయన్నారు. ఆసక్తి కలిగిన జిల్లా క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో రిపోర్టు చేయాలని చెప్పారు. జూనియర్ విభాగంలో ఎంపికైనవారు డిసెంబరు 5 నుంచి 7 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా నుంచి పాల్గొంటారని తెలిపారు. అలాగే సీనియర్ విభాగంలో ఎంపికైన క్రీడాకారులు డిసెంబరు 11 నుంచి 14 వరకు కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సిద్దిపేట జిల్లాలోని కబడ్డీ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కోసం 9550847409, 9177822113, 9912585879 నంబర్లను సంప్రదించవచ్చన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు సంపంగి రాజు, సంయుక్త కార్యదర్శులు శ్రీకాంత్, కరుణాకర్, మహేష్, నరేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

'అమ్మకు అక్షర మాల'ను విజయవంతం చేయండి

- ఉమ్మడి జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి


పొదుపు సంఘాల మహిళలకు అక్షర వికాసం పుస్తకాలు వెంకట్‌రెడ్డి

కల్హేర్/సిర్గాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యత నిర్మూలన కోసం నిర్వహిస్తున్న 'అమ్మకు అక్షర మాల' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్‌రెడ్డి కోరారు. కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో ఆదివారం ఐకేపీ మండల, గ్రామ మహిళా సమైఖ్య ప్రతినిధులు, సీసీలు, వీవోఏలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యత నిర్మూలనకు ఉల్లాస్ యాప్‌లో పొదుపు సంఘాల్లోని నిరక్షరాస్యుల పేర్లు నమోదు చేసినట్లు తెలిపారు. ఇందులో ఉన్న వారికి చదువుకున్న పొదుపు సంఘాల సభ్యులు అక్షరాలు నేర్పించి, కనీస చదువు వచ్చేలా చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈ కార్యక్రమం అమలు కోసం శిక్షణలు కొనసాగుతున్నాయని, త్వరలోనే క్షేత్ర స్థాయిలో వయోజన విద్యా కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కల్హేర్, సిర్గాపూర్ ఐకేపీ ఏపీఎంలు వంశీకృష్ణ, సరిత, సెర్ప్ సీఆర్‌పీలు జాహెదా, సునిత, సీసీలు, వీవోఏలు, మండల, గ్రామ మహిళా సమైఖ్య అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలీస్, ప్రెస్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్


కప్ అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు, ఎస్పీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే పోలీస్, ప్రెస్ వర్గాల మధ్య రాబోయే రోజుల్లో సత్సంబంధాలు పెంపొందించేందుకు ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించినట్లు ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పోలీస్, ప్రెస్ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ జరిగింది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న ప్రెస్ టీం 15.5 ఓవర్లలో 101 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పోలీస్ జట్టు 11.4 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ప్రెస్ జట్టుపై విజయం సాధించింది. టోర్నీలో చివరి పరుగును ఎస్పీ శ్రీనివాసరావు చేసి జట్టుకు విజయాన్ని అందించారు. అత్యధిక పరుగులు చేసిన ఆర్ఎస్ఐ నరేష్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచారు. విజేతగా నిలిచిన పోలీసు జట్టుకు, రన్నరప్‌గా నిలిచిన ప్రెస్ జట్టుకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి బహుమతులను అందజేశారు. అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్‌గౌడ్, రంగానాయక్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, పోలీసులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లాకు తృతీయ స్థానం



బహుమతి అందుకుంటున్న ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు

మెదక్ అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. పాఠశాల క్రీడా సమాఖ్య తెలంగాణ ఆధ్వర్యంలో నల్గొండలో గత మూడు రోజులుగా రాష్ట్రస్థాయి అండర్-17 బాలుర టోర్నమెంట్ జరిగింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ ప్రథమ, మహబూబ్‌నగర్ ద్వితీయ స్థానం సాధించాయి. రంగారెడ్డి-మెదక్ ఉమ్మడి జిల్లా మధ్య హోరాహోరీగా సాగిన మ్యాచ్ డ్రాతో ముగిసింది. అనంతరం ఇరు జట్ల మధ్య జరిగిన పెనాల్టీ షూట్ అవుట్‌లో మెదక్ జిల్లా జట్టు 4-3 తేడాతో రంగారెడ్డిపై విజయం సాధించింది. శాసనమండలి సభ్యులు శంకర్ నాయక్ చేతుల మీదుగా జట్టు బహుమతి అందుకున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు.

సాయిబాబా ఆలయ హుండీ లెక్కింపు

నారాయణఖేడ్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం హుండీ డబ్బులు లెక్కించారు. గత ఆరు నెలల అనంతరం భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకలు లెక్కించగా ఆలయానికి రూ.89,500 వచ్చింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ బాధ్యులు హుండీ డబ్బులు సమర్పించిన భక్తులకు, లెక్కించిన భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాస్ బుక్కులు ఇప్పిస్తామని మోసం

కోహెడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలంలో పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇప్పిస్తామని మోసం చేసిన ఇద్దరు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం. కోహెడ మండల కేంద్రానికి చెందిన గద్దం చంద్రమౌళి, రేవోజు కనకయ్య లకు చెందిన వ్యవసాయ భూములకు పట్టా పాస్‌బుక్‌లు ఇప్పిస్తామని కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన పిన్నింటి శ్రీహరి, పల్లె యాదగిరి అనే వ్యక్తులు డబ్బులు తీసుకున్నారు. డబ్బులు తీసుకొని పట్టాదార్ పాస్ పుస్త కాలు ఇవ్వకపోవడంతో మోసపోయామని తెలుసుకున్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై విచారణ అనంతరం మోసం చేసి నట్లు తేలడంతో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. హుస్నాబాద్ న్యాయ మూర్తి ముందు హాజరు పరచడంతో రిమాండ్‌కు తరలించారు.

చదువుతో పాటు కరాటే కూడా అవసరం

సిద్దిపేట కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ది ఇంటర్నేషనల్ అయిన్ చాంగ్ నింజుక్ వైనీస్ మార్షల్ ఆర్ట్ స్పోర్ట్స్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో సుమారు 40 మంది విద్యార్థులకు బెల్ట్‌గ్రేడ్ సర్టిఫికెట్లు అందించారు. ఆదివారం సిద్దిపేటలోని శైలాసగిరిలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో కటాస్ విభాగం, స్పారింగ్ విభాగంలో పాల్గొన్న కరాటే విద్యార్థులకు ఎగ్జామినర్ ఎస్ రఘునందన్ రెడ్డి సర్టిఫికెట్ బెల్టులు అందజేశారు. పిల్లలకు చదువుతో పాటు కరాటే ఎంతో అవసరమని, కరాటే ఆరోగ్యంగా ధైర్యంగా మానసికంగా ఎదుగుదలకు దోహద పడుతుందన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం

రాయపోల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఇప్పటివరకు సుమారు 40 శాతం మాత్రమే మొదలయ్యాయి. పెట్టుబడికి డబ్బు లేకపోవడంతో కొందరు ఇళ్ల కట్టేందుకు స్థలం లేకపోవడంతో మరికొందరు పనులు మొదలుపెట్ట లేదని తెలుస్తోంది. త

రామారం పైలట్ ప్రాజెక్ట్‌లోనే పనులు నిలిపివేత

దాదాపు పదినెలల క్రితం రాయపోల్ మండలం రామారం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి నిర్వహించిన సర్వేలో 183 మందికి ఇళ్లు అవసరం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అనంతరం వీరందరికి ఇంది రమ్మ ఇళ్లు మంజూరు చేశారు. వెంటనే పనులు ప్రారంభించాలని సూచిం చినప్పటికీ, ఇప్పటివరకు కేవలం 55 మందికి మాత్రమే ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించి వివిధ దశలలో కొనసాగిస్తున్నారు.

మిగతా లబ్ధిదారులు పనులు మొదలు పెట్టకపోవడంతో పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభ దశలోనే తీవ్ర మందగమనంలో కొనసాగుతున్నది.

మండల వ్యాప్తంగా 209 మంది లబ్ధిదారులు

మండలంలోని అన్ని గ్రామాల్లో ఆరు నెలల క్రితం నిర్వహించిన గ్రామ సభల్లో మొదటి విడతగా 209 మంది లబ్ధిదారులను గుర్తించారు. వీరంద రికీ ఇళ్లు మంజూరు కావడంతో, వెంటనే నిర్మాణాలు మొదలు పెట్టాలని లబ్ధిదారులకు అధికారులు సూచించారు.


రాయపోల్‌లో ఇల్లు మంజూరైందని పాత ఇల్లు కూల్చి చదును చేసుకున్న స్థలం

కానీ ఇక్కడ కూడా నిర్మాణాలు నిలిచిపోయిన కుటుంబాలు అధికంగా ఉన్నట్లు అధికారుల నివేదిక వెల్లడిస్తున్నది. డబ్బులు లేకపోవడం, భూసం బంధిత సమస్యలు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

పాత ఇల్లు కూలగొట్టాం

● ఇప్పుడు మంజూరు లేదంటున్నారు

ఆన్లైన్‌లో నా పేరు ఉందని చెప్పిన అధికారులు పనులు వెంటనే ప్రారంభించాలని తెలిపారు. దీంతో మా పాత ఇల్లు కూలగొట్టాం. జాగాను సిద్ధం చేసుకుని పనులు మొదలుపెట్టేందుకు ముగ్గు పోయాలని కోరగా అధికారులు వచ్చారు. అనంతరం రికార్డులు తిప్పిచూసి ఇల్లు మంజూరు కాలేదని తెలిపి వెళ్లిపోయారు. మండల అధికారుల వద్దకు ఎన్నిసార్లు వెళ్లినా సరైన స్పందన లేదు. ఇల్లు కూలగొట్టడంతో ఇప్పుడు మేము ఉండేందుకు కూడా చోటు లేక ఇబ్బంది పడుతున్నాం. వెంటనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతున్నా.

-ఉపనగళ్ల కవిత రాయపోల్

నోటిఫికేషన్లలో మాలలకు అన్యాయం

గజ్వేల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లలో మాలలకు అన్యాయం జరుగుతుందని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నిరుడి స్వామి అన్నారు. గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆరు నెలలుగా అన్ని నోటిఫికేషన్లలో సొంత కులం మాలలకు జరుగు తున్న అన్యాయంపై మాల ప్రతినిధులు నోరు విప్పక పోవడం దారుణమన్నారు. మాలలకు జరుగుతున్న అన్యాయం రోస్టర్ విధానాన్ని సవరించి రిజర్వేషన్లు రెండు శాతం పెంచాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడా లేని వర్గీకరణ తెలంగాణలోనే ఎందుకు అమలోకి తెచ్చారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా మాల ప్రజాప్రతినిధులు నోరు మెదు పకపోవడం బాధాకరమని అన్నారు.


లక్మపల్లి బస్టాండ్ వద్ద భారీ వర్షాలతో కోతకు గురైన రోడ్డు

కల్వర్టు పనులు మర్చిపోయారా?

● రెండేళ్లుగా ఎదురు చూస్తున్న లక్మపల్లి గ్రామస్తులు

మద్దూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కల్వర్టు మరమ్మతులకు పైపులు ఇప్పించిన కాంగ్రెస్ మండల నాయకులు అభ్యర్థి పరాజయంతో ఆ వైపే తొంగిచూడకపోవడంతో లక్మపల్లి గ్రామస్తులకు ఎదురుచూపులు తప్పడం లేదు. మండలంలోని లక్మపల్లి నుంచి రేబ ర్తికి వెళ్లే ఈ మట్టిరోడ్డులో ఉన్న కల్వర్టు యేళ్లుగా మరమ్మతులకు నోచుకోకుండా పోయింది. గతంలో దర్గాలం నుంచి లక్మపల్లి మీదుగా రేబర్తి వరకు మంజూరైన బీటీ రోడ్డు పనులకు దర్గాలం నుంచి లక్మపల్లి వరకు గుత్తేదారు కంకరపోసి అర్థాంతరంగా పనుల్ని నిలిపివేశారు. వర్షాకాలంలో ఈ రోడ్డు కోతకు గురవ్వడమే కాకుండా దీర్ఘ కాలంగా మరమ్మతులకు నోచుకోని కల్వర్టు గుండా వాహనదారులు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు.

ఈ రోడ్డు పొడవునా అక్కడక్కడా కంకర తేలి, రోడ్డు కోతకు గురై ప్రయాణం నర కప్రాయంగా మారిందంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల పూర్వమే అని ఈ కల్వర్టుకు మరమ్మతులు జరిపించాలని నాయకులకు లక్మపల్లి గ్రామస్తులు చేసిన విజ్ఞప్తి మేరకు అనుకున్నదే తడవుగా సుమారు రూ.60 వేలు వెచ్చించి నాలుగు పెద్ద పైపులు తెప్పించి కల్వర్టు సమీపంలో నిల్వచేయించారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయి రెండేళ్లు దాటినా.. బీటీ రోడ్డు పనులు జరిపించడంతో పాటు కల్వర్టుకు మరమ్మ తులు చేపట్టాలని దర్గాలం, లక్మపల్లితో పాటు రేబర్తి గ్రామస్తులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

టెట్ ఉచిత అవగాహన సదస్సు

సిద్దిపేట క్రైం నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని డీక్ల జూని యర్ కళాశాలలో ఈ నెల 20 వ తేదిన సాయంత్రం 5 గంటలకు టెట్ అవగా హన సదస్సు నిర్వహిస్తున్నట్లు సైన్స్ - సక్సెస్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని డైట్, బీఈడీ చేసిన అభ్యర్థులు , ప్రభుత్వ ఉపాధ్యాయులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. త్వరలో డైట్, బీఈడీ అభ్యర్థులతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా టెట్ క్లాసులు ప్రారంభిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 9440005030,9703113448 నెంబర్లను సంప్రదించాలన్నారు.

కడవేరుగు బ్రిడ్జి అవతలలో మట్టి, మొరంతో మరమ్మతులు

చేర్యాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం కడవేరుగు గ్రామశి వారులో అర్థాంతరంగా నిలిచిపోయిన హై లెవల్ బ్రిడ్జి అవతలలో ప్రమాదక రంగా మారిన గుంతలను పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మల్గారి వేణు స్వతహా డబ్బులు భరించి మట్టి,మొరం పోయించి మరమ్మతులు నిర్వహించారు. నిత్యం ఈదారి వెంబడి ఎంతోమంది ప్రయాణిస్తున్న నేపథ్యంలో ప్రమాదాలు జరిగేవని ఆయన గుర్తించి మట్టి మొరం పోయించి గుంతలు పూడ్చివేయించారు. ఈమేరకు ఆయనను స్థాని కులు అభినందించారు.

విద్యుత్ "ప్రజాబాట"

(5వ పేజీ తరువాయి)

నేడు విద్యుత్ అధికారులు, సిబ్బంది ప్రజల వద్దకు వచ్చి సమస్య లపై ఆరా తీస్తుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో విద్యుత్ గణాంకాలు

సిద్దిపేట జిల్లాలో మొత్తం మూడు డివిజన్లు ఉన్నాయి. సిద్ది


సిద్దిపేటలో విద్యుత్ ప్రజాబాట కార్యక్రమంలో అధికారులతో కలిసి పర్యటిస్తున్న సిద్దిపేట డీఈ రామచంద్రయ్య

పేటలో 19 వేలకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు, హుస్నాబాద్‌లో 15 వేలకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు, గజ్వేల్‌లో 16 వేలకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. మొత్తం 50 వేలకు పైగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 33 సెక్షన్లు ఉన్నాయి. జిల్లాలో మొత్తంగా 5,86,350 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో గృహానికి సంబంధించి (డొమెస్టిక్) 3,52,800 విద్యుత్ కనెక్షన్లు, కమర్షియల్ 44,989 కనెక్షన్లు, వ్యవసాయానికి సంబంధించి 1,73,360 కనెక్షన్లు, ఇతరత్రా 15,201 విద్యుత్ మీటర్లు ఉన్నాయి.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం



జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ ను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక నుంచి వారంలో మూడు రోజుల పాటు నాలుగు గంటలకు పైగా ఉన్నత స్థాయి అధికారి నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు విద్యుత్ సమస్యలను ఆరా తీసి వాటిని అప్పటికప్పుడే పరిష్కరించేం దుకు కృషి చేస్తాం. వ్యవసాయ రంగానికి లో-వోల్టేజ్ సమస్య తలెత్త కుండా నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నాం. విద్యుత్ ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా విద్యుత్ విషయమై ఏదైనా సమస్యలుంటే గ్రామాలకు, పట్టణాల్లోని వార్డుల్లో పర్యటిస్తున్న అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకురావాలి.

-టి.ఆర్. చంద్రమోహన్, ఎస్ఈ, విద్యుత్‌శాఖ, సిద్దిపేట

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే..

● కఠిన చర్యలు తప్పవు

మిరుదొడ్డి, నవంబరు16 (ఆంధ్రజ్యో తి):అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో అనుమతి లేకుండా కామెడీ సంజీవ్ సూపాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. సూపాన్ని నిర్మించడానికి అనుమతి లేదని చెప్పారు. అనుమతులు లేకుండా గ్రామంలో ఎలాంటి నిర్మాణాలను చేపడితే కఠినంగా వ్యవహరించడం జరుగుతుం దని హెచ్చరించారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టే వారిపై నిఘా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మమత తది తరులున్నారు.

దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన


దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం తాడూరు గ్రామంలో శ్రీ భక్తాంజనేయ, నంది, నాగ, పార్వతీమహ దేవ, వేణుగోపాల, గణేశ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈమేరకు రెండవరోజైన ఆదివారం ఆయా దేవతామూర్తుల మూలవిరాట్టు కు విశేషపూజలు నిర్వహిం చారు. శాస్త్రోక్తయుక్తంగా పూజాదికాలు జరిపారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వేడుకలలో పాల్గొని దేవతామూర్తు లను దర్శించుకున్నారు.

నేడు ఐక్యతా మార్చ్

సిద్దిపేట కల్చరల్, నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి): సర్దార్ పటేల్ 150వ జయంతిని పుర స్కరించుకుని నేడు (సోమవారం) సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఐక్యతా మార్చ్ నిర్వహించను న్నారు. మేరా యువ భారత్ (మైభారత్), యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నుంచి ముస్తాబాదు చౌరస్తా మీదుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు ఈ పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ కార్యక్రమా నికి మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరై ఐక్యతా మార్చ్‌ను జెండా ఊపి ప్రారంభిస్తారని మై భారత్ ఉమ్మడి జిల్లా యువజన అధికారి ఎం. రంజిత్ రెడ్డి తెలిపారు. అలాగే జిల్లా కలె క్టర్ హైమావతితో పాటు పలువురు జిల్లా అధి కారులు పాల్గొంటారన్నారు. వివిధ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు హాజరై ఐక్యతా మార్చ్‌ను విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా 18వ పడిపూజ

ములుగు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ములుగులో అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఆదివారం ములుగులోని హనుమాన్ టెంపుల్ ఆవరణలో గ్రామానికి చెందిన జాలిగామ దశరథ 18వ పడిపూజ కార్య క్రమం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో వేద పండితులతో పాటు పాటలతో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు మురళీధర్‌రెడ్డి, బలవంతరెడ్డి, చంద్రశేఖర్, నరసింహారెడ్డి, మహేష్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.


అయ్యప్ప పూజలో ఊరేగింపు

సమాజ శ్రేయస్సుకు పాటు పడాలి

వైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని అభినందించిన హరీశ్‌రావు


ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సత్యసాయిబాబా దేవాలయకమిటీ

సిద్దిపేట కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణ వైశ్య సంఘం నూతన కార్యవర్గం సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలి పారు. కొన్ని ఏళ్ల తరువాత పట్టణ వైశ్య సంఘం కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడం సమాజానికి కొత్త ఉత్సాహాన్ని ఇవ్వడమని, ఈ కొత్త కార్య వర్గం సమాజ శ్రేయస్సుకు మంచి కార్యక్రమాలు చేసే వైశ్య సంఘం అభివృద్ధి కు పాటు పడాలని సూచించారు. అందుకు తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ వారిని శాలువాతో సత్కరించారు.

హరీశ్‌రావుకు ఆహ్వానం

భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత వర్ష జయంతి సందర్భంగా మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావుకి సిద్దిపేట సత్య సాయి బాబా దేవాలయ వారు ఆహ్వానం పలికారు. ఈ నెల 19 నుంచి 23 వరకు జరిగే శతవర్ష జయంతి వేడుకలు సిద్దిపేట సత్య సాయి బాబా దేవా లయం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈ ఉత్సవాలకు రావాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికని స్వామి ప్రసాదాన్ని హరీశ్ రావుకి అందజేశారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యం

గజ్వేల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమ స్యల పరిష్కారం కోసం ఉద్యమాలే శరణ్యమని సీఐ టీయూ జిల్లా కార్యదర్శి బండ్ల స్వామి అన్నారు. సిద్ది పేట పట్టణంలో జరిగిన సీఐటీయూ జిల్లా నాల్గవ మహాసభలకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధి లోని రాణే మద్రాస్ లిమిటెడ్ పరిశ్రమ కార్మికులు, యూనియన్ నాయకులు కదలివెళ్లారు. ఈ సంద ర్భంగా రాష్ట్రమహాసభలకు విరాళాన్ని యూనియన్, కార్మికుల తరఫున అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మహాసభలలో నిర్ణ యించిన స్కీమ్ వర్కర్ల సమస్యలు, కార్మికులు కనీస వేతనాల పెంపుదల, గ్రామపంచాయతీ, మునిసిపల్, హమాలీ, భవన నిర్మాణ, పరిశ్రమ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఉద్యమ కార్యాచరణ చేయనున్నట్లు తెలి పారు. ఆయనతోపాటు పరిశ్రమ కార్మికులు, సీఐటీయూ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

తైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్


మెడల్స్, ధృవపత్రాలు అందజేస్తున్న వేదేటీ రఘోత్తమ్మరెడ్డి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వ ర్యంలో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్ నిర్వహించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఏ.ఎం.ఎ హాల్లో జరిగిన పోటీల్లో 70 మంది విద్యార్థులు పాల్గొని కలర్ బెల్టులు సాధించారు. కలర్ బెల్టులు గెలుపొందిన తైక్వాండో విద్యార్థులకు సిద్దిపేట జిల్లా తైక్వాండో గౌరవ అధ్య క్షుడు వేదేటి రఘోత్తమ్మరెడ్డి బెల్టులు, మెడల్స్‌తో పాటు ధ్రువీ కరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణశర్మ మాట్లాడుతూ తైక్వాండో ద్వారా ఆత్మ రక్షణ, శారీరక ధృఢత్వంతో పాటు క్రమశిక్షణ, మంచి ఆరోగ్యం, మేధాశక్తి పెరుగు తుందన్నారు. సిద్దిపేట తైక్వాండో విద్యార్థులు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో పత కాలు సాధించి గుర్తింపు పొందారని తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

ములుగు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం బస్వాపూర్, సింగన్నగూడ, శ్రీరాంపూర్ గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక హైదరాబాద్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు. దేవ జ్ఞానం ప్రకారం కులాలు అనేకంకావు, మతాలు నిషిద్ధం అని తెలియజేశారు. త్రైత సిద్ధాంత భగవ ద్గీత, అనుబంధ జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు. దైవ జ్ఞానం ప్రకారం కులాలు అనేకంకావు, మతాలు నిషిద్ధం అని తెలియజేశారు. త్రైత సిద్ధాంత భగవ ద్గీత శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానాన్ని వివరించిందని, కర్మయోగ విశిష్టత, త్రైత జ్ఞానం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మగా మూడు ఆత్మల తత్వమే త్రైత సిద్ధాంతమని తెలిపారు. గీతలోని కర్మయోగం, బ్రహ్మ యోగం, భక్తియోగం, దైవ ధర్మాలు అని, వాటి ప్రకారం నడిస్తే కర్మ నుంచి విముక్తి లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు, సభ్యులు పాల్గొన్నారు.

వైన్‌షాప్ ఏర్పాటు చేస్తే సహించం

చేర్యాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేవీఆర్ నగర్ కాలనీవాసులకు ఇబ్బందికరంగా మార నున్న ఎంపిక వైన్‌షాప్ ఏర్పాటును ఉపసంహరించుకో వాలి. లేనియెడల ఎంతమాత్రం సహించబోమని సాయి కేవీఆర్ మైత్రి మెంబర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆది వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాలనీ ప్రధాన దారి అనుకుని వైన్‌షాప్, సిట్టింగ్ పర్మిట్ రూం ఏర్పాటు కు తీసుకుంటున్న చర్యలపై ఇటీవల ఎక్సైజ్ సూపరింటెం డెంట్, చేర్యాల సీఐకి వినతిపత్రం సమర్పించినా పెడచె విన పెట్టడం సరికాదని పేర్కొన్నారు. వైన్‌షాప్ ఏర్పా టును ప్రతిఘటిస్తామని, ఈమేరకు కాలనీవాసులు తీర్మానం చేసినట్లు తెలిపారు.

కనీస సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కృషి

కొండపాక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లతోపాటు బీటీ రోడ్ల సౌకర్యాన్ని కల్పిస్తూ కనీస వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. కొండపాక మండలం రాజంపల్లి జప్తి నాచారం నుంచి కొండపాక వరకు వెళ్లే బీటీ రోడ్డు పనులను ఆదివారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుం దని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఇంది రమ్మ ఇల్లు , ఉచిత విద్యుత్ అర్హులకు రేషన్ కార్డులు లాంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద ప్రజల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. రాజంపల్లి చౌరస్తా నుంచి జప్తి నాచారం గ్రామం మీదుగా కొండపాక మైన్ మిల్ వరకు 90 లక్షల రూపాయలతో బీటీ రోడ్డు ను వేయనున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వాసరి లింగారావు , వర్కింగ్ ప్రెసిడెంట్ కొయ్యడ వెంకటేశం,గజ్వేల్ సుదర్శన్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు, కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ చిన్న శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట అభివృద్ధికి పునాది వేసిన నాయకుడు మదన్‌మోహన్

సిద్దిపేట నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):సిద్దిపేట నియోజకవర్గ ప్రజల మనస్సులో మాజీమంత్రి, దివంగత కాంగ్రెస్ నేత మదన్‌మోహన్ చిరస్మాయిగా నిలిచిపోయారని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలో మాజీమంత్రి, కాంగ్రెస్ పార్టీ దివంగత నాయకుడు మదన్‌మోహన్ జయంతి సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అత్తుఇ మామ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మార్క సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సిద్దిపేట కీర్తిని ఢిల్లీకి చాటిచె ప్పిన నాయకుడు మదన్‌మోహన్ అని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని సిద్దిపేట నుంచి ఉద్యమం ప్రారంభించారన్నారు. సిద్దిపేట అభివృద్ధికి పునాది వేసి, తనదైన శైలిలో కృషి చేశారని, ఈ ప్రాంత ప్రజలకు 30 వేలకు పైగా ఉపాధి కల్పించారని చెప్పారు.


ఇటీవల రోడ్డుప్రమాదంలో నాయపద్ద ఫ్యాక్స్ చైర్మన్ హరికృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

బాధిత కుటుంబాలను పరామర్శించిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

తొగుట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ కారులు మనహార్ కు లతం కొమ్ము కిషన్ ఆకాల మరణం బాధాకరమని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య విచారం వ్యక్తం చేశారు. మనహార్ లో ఇటీవల మరణించిన కొమ్ము కిషన్ కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు. అలాగే మనహార్ లో ఇటీవల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు యాదిరెడ్డి రాజు తండ్రి మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అదే గ్రామంలో ఇటీవల ప్రమాదానికి గురైన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మంగలి యాదగిరిని పరామర్శించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు చెల్లించాలి

దౌల్తాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన నిర్వహణ కార్మికుల బిల్లులు వెంటనే చెల్లించాలని యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఆది లక్ష్మి అన్నారు. ఆదివారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు గత పది నెలలుగా వేతనాలు, బిల్లులు చెల్లించడం లేదని, ప్రభుత్వం ఇచ్చే బడ్జెట్ కి రెండు గుడ్లు కూడా రావడం లేదని అన్నారు. పది నెలల నుండి బిల్లులు పెండింగ్ లో ఉంటే కార్మికులు ఎలా బతకాలి అని, ఎంత కాలం ఈ విధంగా అప్పు చేసి పెడతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చాలా సార్లు కలెక్టర్, డీఈఓ లకు విన్నవించిన ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 20వ తేదిన ఛలో ఎడ్యుకేషనల్ డైరెక్టర్ కార్యాలయం ముట్టడి విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు యాదమ్మ, ప్రమీల, ఇందిరమ్మ, భారతమ్మ, ఉమారాణి, అనిత, భవాని తదితరులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్: తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు